# రెండు శవాలు

## ప్రతాప రవిశంకర్

రోలర్ బాల్—సినిమా జరుగుతోంది....థియేటరంతా పూర్తిగా మనుషులతో నిండిపోయి వుంది. రెండు రోజుల క్రితమే ఆ ఇంగ్లీషు సినిమా రిలీజయియింది.

బాల్కనీలో వెనుకవరుసలో కూర్చున్నారు సుమిత్ర-రాఘవ.

ఇద్దరూ చిన్నగా మాట్లాడుకుంటున్నారు....యెవ్వరూ వాళ్ళను గమనించటంలేదు. అంతా సినిమా చూడటంలో లీనమయి వున్నారు.

"ఇంకో రెండురోజులు వుండకూడదా?" చిన్నగా అన్నాడు రాఘవ.

"రెండురోజులా! ఇప్పటికి నేనొచ్చి పది రోజులయింది. వారం రోజులలో నే తిరిగి వస్తానని ఆయనతో చెప్పాను. ఆయన వొప్పుకోలేదు. అమ్మనీ, చెల్లెళ్ళను చూడాలని వుందని చెప్పి వచ్చాను. నిజానికి నేను యీ వూరు వచ్చింది రెండు నెలల క్రితమే కదా! మళ్ళీ

యిప్పుడు ఆయన పంపించటానికి వొప్పుకొంటా డనుకో లేదు.

ఎట్లాగో వారం రోజుల్లో నే తిరిగొస్తానని వచ్చాను.... యిక ఈ రోజయినా బయల్దేరకపోతే బావుండదు. అంతే కాకుండా ఈ రోజు రాత్రి ఎక్స్‌ప్రెస్‌కు బయల్దేరి వస్తున్నట్టుగా ఆయనకు ఉత్తరం రాశాను. నేను రాకపోతే ఆయన యిక్కడకు రావొచ్చు....ప్లీజ్! నన్నాపకు రాఘవా...." అన్నది సుమిత్ర.

"మళ్ళీ ఎప్పుడు రావటం?" దిగులుగా అడిగాడు రాఘవ.

"ఎందుకంత దిగులు? నాకు మాత్రం వెళ్ళాలని వుందా? కాని తప్పదు. పెళ్ళయినదాన్ని....మళ్ళీ ఓ నెల రోజుల్లో ఏదో ఒక ప్లాను వేసి వచ్చేస్తానుగా. ఇంతకు ముందులా నువ్వు నేను వెళ్ళగానే ఉత్తరం రాయకు.... నిజంగా అప్పుడు అదృష్టమే. ఆయన ఆ ఉత్తరాన్ని చదవలేదు. నాకే ఇచ్చేశాడు. సాధారణంగా నా పేరున వచ్చిన ఉత్తరాలను ఆయన చదవడు."

"మంచి మొగుడు" నవ్వాడు అతను.

"అవును. అందుకే మనం ఇప్పటికీ సుఖపడగలుగుతున్నాం...." అన్నది ఆమె.

"నీ మొగుడి మంచితనం పదికాలాలపాటు ఇలాగే వర్ధిల్లాలని కోరుకుందాం" అన్నాడు చిన్నగా సుమిత్ర చేతిని నొక్కి.

నవ్వింది ఆమె.

"స్టేషన్‌కు వచ్చేదా?" అడిగాడు.

"వద్దు. ఎవరయినా చూస్తే ప్రమాదం. ఇప్పటివరకూ మన వ్యవహారం ఎవ్వరికీ తెలీదు. ఎందుకు అనవసరంగా

దీన్ని బయటకు లాగటం? నువ్వు రావద్దు బాబూ. నేను వెళతానుగా."

"నీ యిష్టం...." అన్నాడు చేతిని ఆమె భుజంమీద వేసి.

తర్వాత తన మొహాన్ని ఆమె బుగ్గ దగ్గరగా తీసుకొచ్చాడు రాఘవ. అతని వూపిరి ఆమెకు వేడిగా తగిలి ఒళ్ళు జలదరించింది. తర్వాత అతను చిన్నగా ఆమె బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు.

సుమిత్ర హాయితో కళ్ళు మూసుకుంది.

రాఘవ ఆమెవైపు చూసి చిలిపిగా నవ్వాడు.

"యూ సిల్లీ...." అన్నది చిన్నగా.

మరోసారి నవ్వాడు.

"టైమెంతయ్యింది?" అడిగింది.

"ఐదుగంటలు కావస్తోంది."

"సినిమా అయిపోవస్తుందనుకుంటాను."

"అవును."

"అయితే సినిమా వదలకముందే వెళ్ళిపోదాం."

తల వూపాడు. రాఘవ.

"ముందు నేను వెళతాను. తర్వాత నువ్వు వచ్చెయ్" అన్నది.

రాఘవ సరేనన్నాడు.

లేచి నిలబడింది సుమిత్ర.

సినిమా క్లయిమాక్స్‌లోకి వచ్చింది. రోలర్ బాల్ ప్లేలో అందరూ అవుటయ్యారు. ఇక ఇద్దరే మిగిలారు. ఇద్దరికీ బాగా దెబ్బలు తగిలాయి. ఆయాసంతో రొప్పుతున్నారు.

గబగబా చీకట్లో కుర్చీలమధ్యనించి బయటకు వచ్చింది

సుమిత్ర.

చలి కాలం కావటంవల్ల అప్పటికే పొద్దు వాలి పోతోంది.

సుమిత్ర బయటకు వచ్చిన రెండు నిముషాల తర్వాత రాఘవ కూడా బయటకు వచ్చాడు.

అతనే రిక్షా మాట్లాడాడు. ఎక్కిందిఆమె.

"గుడ్ బై డియర్" చిన్నగా నవ్వుతూ అన్నాడు రాఘవ.

"గుడ్ బై" అన్నది సుమిత్ర ప్రేమగా. రిక్షా ముందుకు పరుగుదీసింది.

## 2

సూట్కేసులో బట్టలు సర్దుకుంది సుమిత్ర. అప్పటికి టైము ఎనిమిది గంటలు కావస్తోంది రాత్రి....

"అన్నీ సర్దుకున్నావో లేదో చూసుకోవే అమ్మాయ్. తర్వాత మీ వూరు వెళ్ళి ఉత్తరం రాస్తావ్ ఏ జాకెట్టో, చీరో మర్చిపోయా నంటూ...." అన్నది సుమిత్ర తల్లి.

"ఏమీ మరచిపోలేదులే. అన్నీ సర్దుకున్నాను" అన్నది సుమిత్ర.

"మళ్ళీ ఎప్పుడే అక్కయ్యా ఈ వూరొచ్చేది?" అడిగింది సుమిత్ర మొదటి చెల్లెలు వసంత.

"నీ పెళ్లికే" నవ్వుతూ అన్నదామె.

వసంత సిగ్గుపడి "అయితే ఇంకో ఏడాదివరకూ రావన్న మాట" అన్నది.

"అంతే అనుకో."

"బావగార్ని అడిగానని చెప్పు...." అన్నది రెండో చెల్లెలు అరుంధతి.

"అడిగానని చెప్పటమేనా? ఇంకేవయినా సందేశాలు అందజేయమంటావా?" నవ్వుతూ అడిగింది.

"సందేశాలు అందజేస్తే నువ్వు సహించగలవా?"

"ఆ....నిరభ్యంతరంగా సహించగలను...." జడను అల్లుకుంటూ అన్నది.

"అయితే బావగారికి నా ముద్దులని చెప్పు."

"ఓసి పక్షీ....ఏమో అనుకున్నాను. నువ్వూ పెద్ద దానివయిపోయావు" అన్నది నవ్వి.

అరుంధతి కూడా నవ్వి "నీకు పైత్యమయిపోతోంది" అన్నది.

తర్వాత ఐదు నిముషాలకు సుమిత్ర సూట్కేసు తీసుకుని ఇంట్లోనించి బయటపడింది.

"జాగ్రత్త అమ్మాయ్. వెళ్ళగానే ఉత్తరం రాసి పడెయ్. అసలే రాత్రి ప్రయాణం. జాగ్రత్త. అందునా ఒక్కదానివే వెళుతున్నావ్" అన్నది తల్లి.

"ఏం భయం లేదులే....పెళ్ళి అవకముందే ఒంటరిగా ప్రయాణాలు చేశాను. వెళతాను...." అని ముందుకు కదిలింది.

చెల్లెళ్ళు స్టేషనుకు వస్తామన్నారు. వద్దన్నది సుమిత్ర. ఆమెకు తను వద్దని చెప్పినా రాఘవ స్టేషన్కు వస్తాడేమోనని అనుమానం వుంది. అందుకే వాళ్ళను స్టేషన్కు రావద్దన్నది.

మెయిన్ రోడ్డుమీదకు వచ్చిన తర్వాత సుమిత్ర రిక్షా బేరం చేసుకుని ఎక్కింది.

పావుగంట తర్వాత రిక్షా రైలుస్టేషన్ ముందు ఆగింది.

దిగి రిక్షావాడికి డబ్బులిచ్చి సూట్కేసుతో లోపలకు

నడిచింది.

బుకింగ్ కౌంటర్ దగ్గర అంతగా మనుషులు లేరు. ఇద్దరు మగవాళ్ళు టిక్కెట్లు తీసుకుంటున్నారు.

టిక్కెట్టు తీసుకుని ప్లాట్ ఫారం మీదకు వెళ్ళింది సుమిత్ర. అప్పటికే రైలు వచ్చి వుంది. ఇంకో పావు గంటలో బయల్దేరుతుంది.

జనరల్ కంపార్టుమెంటు దగ్గరకు వెళ్ళింది ఆమె. లోపలకు ఎక్కలేదు. బయట నిలబడి ప్లాట్ ఫారమంతా కలియజూసింది. ఎక్కడా ఆమెకు రాఘవ కనిపించలేదు. అతను కనిపించనందుకు సుమిత్రకు యెంతో బాధ కలిగింది. తను వద్దని చెప్పినా అతను వస్తాడనుకుంది. అందుకే చెల్లెళ్ళను తనతో స్టేషన్ కు తీసుకురాలేదు.

కంపార్టుమెంటులోకి యెక్కింది. దాన్లో ఎక్కువగా జనం లేరు. చలికాలం కావటంవల్లనేమో రద్దీ తక్కువగా వుంది. ఆ కంపార్టుమెంటులో ఐదుగురు మగవాళ్ళు ముగ్గురు ఆడవాళ్ళు వున్నారు.

కిటికీ పక్కనే కూర్చుంది సుమిత్ర.

పది నిముషాల తర్వాత చిన్న కుదుపుతో ముందుకు కదిలింది రైలు.

"మళ్ళీ ఎప్పుడో ఈ వూరు రావటం" అనుకుంది సుమిత్ర.

రైలు వెళుతూంటే కిటికీలోనించి ప్లాట్ ఫారం మీద నించున్న మనుషులను చూస్తోంది. అందర్నీ దాటిపోయింది రైలు.

రైలు వేగం పెరిగింది. చలిగాలి రివ్వున కొట్టింది. పమిటను ఒంటినిండా కప్పుకుంది సుమిత్ర. ఈ టైములో రాఘవ వుంటే ఎంత బావుండేది పక్కనే అనుకుంది.

రైలు పరుగుదీస్తోంది చీకటిని చీల్చుకుంటూ. సుమిత్ర కళ్ళు మూసుకుంది ఆలోచిస్తూ.

# 3

మరో అయిదు నిముషాల్లో ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ ప్లాట్ ఫాం మీదకు వస్తుందని చెప్పాడు బుకింగ్ క్లర్కు సూర్యారావు టిక్కెట్ తీసుకుంటున్నప్పుడు.

టికెట్ తీసుకుని అక్కడినించి ప్లాట్ ఫాం మీదకు వచ్చాడు అతను. ప్లాట్ ఫాం మీద జనం పలుచగా వున్నారు.

వాచీ చూసుకున్నాడు సూర్యారావు. ఒకటీ ఇరవై అయింది.

జేబులోనించి సిగరెట్ పెట్టె బయటకు తీసి ఓ సిగరెట్ వెలిగించాడు.

చలి అతన్ని చిన్నగా వణికించేస్తోంది.

గట్టిగా పొగను పీల్చాడు. గుండెలో వెచ్చగా వున్నట్లనిపించింది.

సిగ్నల్ వొంగింది.

ఓసారి ప్లాట్ ఫాం చివరివరకూ వెళ్ళాడు సూర్యారావు. తిరిగి వస్తుండగా రైలు వస్తున్న చప్పుడు వినిపించింది.

చేతిలో చివరివరకూ కాలిన సిగరెట్టును రైలు పట్టాల మీదకు విసిరేశాడు.

రైలు సిగ్నల్‌ను దాటి ప్లాట్ ఫాం మీదకు వచ్చింది. కీచుమంటూ ఆగింది.

గబ గబా జనరల్ కంపార్టుమెంటు దగ్గరకు నడుస్తున్నాడు సూర్యారావు. ఆ తొందరలో అతను ఓ మనిషికి డాష్ ఇచ్చాడు. అతను తలెత్తి సూర్యారావును చూసి

"నువ్వా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"సార్" అన్నాడు సూర్యారావు గబుక్కున ముందుకు వెళుతూ అతన్ని పట్టించుకోకుండా.

అతను ఓసారి సూర్యారావును చూసి గబ గబా రిజర్వేషన్ కంపార్టుమెంటు దగ్గరకు వెళ్ళాడు.

సూర్యారావుకు కిటికీ వారగా కూర్చుని నిద్రపోతున్న సుమిత్ర కన్పించింది.

తృప్తిగా నవ్వుకున్నాడు....ఓసారి బయట నిలబడే కంపార్టుమెంటునంతా పరిశీలనగా చూశాడు. సుమిత్ర తప్పించి ఆ కంపార్టుమెంటులో ఎవ్వరూ లేరు.

రైలు కదిలింది.

ఎవరయినా ఆ కంపార్టుమెంటులో ఎక్కుతారేమోనని చూశాడు. ఎవ్వరూ ఎక్కలేదు. రైలు వేగం అందుకోక ముందే గబుక్కున ఆ కంపార్టుమెంటులోకి ఎక్కి వెళ్ళి సుమిత్ర ఎదురుగా కూర్చున్నాడు.

సుమిత్ర ఇంకా నిద్రపోతూనే వుంది. తెరచి వున్న తలుపులోనుంచి లోపలకు వీస్తున్న గాలికి ఆమె ముంగురులు చిన్నగా కదులుతున్నాయి.

"పాపం....ఈ పది రాత్రులనించీ నిద్రలేదేమో" అనుకున్నాడు సూర్యారావు.

సిగరెట్‌ను బయటకు తీసి ఓ సిగరెట్ ముట్టించాడు.

సుమిత్ర మొహాన్ని చూస్తూ సిగరెట్ కాలుస్తున్నాడతను.

## 4

కళ్ళు తెరిచింది సుమిత్ర.

ఎదురుగా కూర్చుని సిగరెట్ కాలుస్తున్న సూర్యారావుని చూసి అదిరిపడింది.

కళ్ళు నులుముకుని మళ్ళీ చూసింది....

"ఏమిటి సుమీ....అంత ఆశ్చర్యపోతున్నావ్? నేనే నీ ప్రియమైన భర్త....సూర్యారావుని" అన్నాడు అతను నవ్వుతూ.

"మీరేనా?" అన్నది సుమిత్ర ఇంకా ఆశ్చర్యంనించి తేరుకోలేక.

"అనుమానంగా వుందా?" అని ఆమె బుగ్గమీద వేలితో సున్నితంగా కొట్టాడు అతను.

"నాకు అంతా కలగా వుంది. మీరు నా ఎదురుగా ఎలా ప్రత్యక్షం కాగలిగారు?"

"ఇక్కడే ఇంతకుముందు ఆగిన స్టేషన్‌లో ఎక్కాను."

"ఈ స్టేషనుకు ఎందుకొచ్చారు? ఎప్పుడొచ్చారు?"

"రాత్రి పది గంటలకు వచ్చాను. ఓ ఫ్రెండు వూరు వస్తూ నన్ను కూడా రమ్మన్నాడు. నువ్వు ఈ ట్రెయినుకే వస్తున్నట్టు వుత్తరం రాశావు కదా! అందుకని అతనితో వచ్చి ఈ స్టేషన్‌నించి నీతో కలిసి వెచ్చగా ప్రయాణం చేద్దామని వచ్చాను" అన్నాడు సూర్యారావు సిగరెట్‌ను కింద పడేసి బూటు కాలితో నలిపి.

"పది రోజులకే అంత విరహం భరించలేక పోయారా?"

"అవును....పది రోజులంటే మాటలా? రెండువందల నలభై గంటలు. నువ్వు ఎలా వుండగలిగావో నాకు ఆశ్చర్యంగా వుంది."

"నేనూ వుండలేకనే ఈ ట్రెయిన్‌కు బయల్దేరింది. మా అమ్మ, చెల్లెళ్ళు ఇంకో నాలుగు రోజులు వుండమని బలవంతం చేశారు" అన్నది ఆమె.

"అలాగా?" అన్నాడతను.

"ఈ కంపార్టుమెంటులో కొత్తగా ఎవరయినా కొత్తగా ఎక్కారా?" అడిగింది సుమిత్ర.

"అవును.... నేనే."

నవ్విందామె.

"ఇప్పుడప్పుడే స్టేషన్ రాదు" అన్నాడతను నవ్వుతూ.

"అయితే ఏమంటారు?" అన్నది చిలిపిగా సూర్యారావు కళ్ళల్లోకి చూస్తూ.

"ఆ మాత్రం తెలీదా?"

తల వంచుకుంది సుమిత్ర సిగ్గుతో. వాళ్ళిద్దరికి పెళ్ళయి మూడేళ్ళయింది.

"రైలు వేగం తగ్గినట్టుంది" అన్నాడు సూర్యారావు లేచి నిలబడి.

"ఏమో నాకు తెలీటం లేదు" అన్నది సుమిత్ర.

"ఉండు....ఏదయినా ట్రాక్ రిపేరు జరుగుతుందేమో చూస్తాను" అని డోర్ దగ్గరకు వెళ్ళి దాన్ని వెనక్కి లాగి బయటకు చూశాడు.

రైలు రివ్వున దూసుకుపోతోంది. గాలికి అతని జుట్టు చిందరవందర అయింది.

"ఏయ్....సుమీ ఇలా రా....రైలు మలుపు తిరుగుతూ ఎలా కనిపిస్తుందో చూడు" అన్నాడు సూర్యారావు బయటకు చూస్తూ.

"మీకు అర్ధరాత్రి ఇదేం సరదా అండీ బాబూ" అంటూ డోర్ దగ్గరకు వచ్చి తల బయటకు పెట్టి ముందుకి చూసింది సుమిత్ర.

రైలు వంపు తిరుగుతోంది....

బయట అంతా చీకటిగా వుంది. నిశ్శబ్దంగా వుంది.

రైలు కంపార్టుమెంట్లలోని దీపాల వెలుతురు

మూసివున్న అద్దాల్లో నించి మసగ్గా బయటకు పడు తోంది.

"బావుంది కదూ?" అన్నాడు సూర్యారావు.

"అవును" అన్నది సుమిత్ర.

రైలు పెద్ద కాలువ మీదనించి వెళుతోంది చప్పుడు చేసుకుంటూ.

సుమిత్ర - సూర్యారావు వున్న కంపార్టుమెంటు వంతెన మీదకు వచ్చింది. అది మామూలు రైల్వేట్రాక్.

"అమ్మో....నీళ్ళంటే నాకు భయం" అని వెనక్కు వెళ్ళబోయింది సుమిత్ర.

కాని సూర్యారావు వెళ్ళనివ్వలేదు.

గబుక్కున సుమిత్ర చెయ్యపట్టి లాగి గట్టిగా రైల్లో నించి కిందకు నెట్టేశాడు.

రైల్లోనించి నీళ్ళల్లోకి పడిపోతూ పెద్దగా గుండెలు పగిలేలా ఆర్తనాదం చేసింది సుమిత్ర.

# 5

మరురోజు వుదయం తొమ్మిది గంటలకు నిద్రలేచాడు సూర్యారావు. స్నానం చేశాడు. నీట్ గా డ్రెస్ చేసు కుని బయటకు వచ్చాడు.

బయటకు వచ్చి యింటికి తాళం పెడుతుండగా పక్క పోర్షన్లో వున్నామె "రాత్రి మీరు ఇంట్లో లేరా?" అనడిగింది.

ఉలిక్కిపడ్డాడు అతను.

"ఎందుకు?"

"ఎందుకేమిటండీ? రాత్రి మన వీధిలో అందరూ రెండు గంటలవరకూ మేలుకునే వున్నారు. ఎవ్వరూ నిద్ర పోలేదు."

"ఎందుకు?"

"పన్నెండు గంటలప్పుడు ఈ వీధిలో ప్లీడరుగారింట్లో ఎవడో దొంగ పడ్డాడు. వాడు డబ్బు నగలు కాజేసి వెళుతుంటే ప్లీడరుగారి మూడో అమ్మాయి చూసి కేకలు పెట్టింది. వెంటనే అందరూ లేచారు. మేము కూడా లేచాం. మీరు బయటకు వస్తారేమోనని చూశాం. కాని రాలేదు. లోపల గడియ వేసివుంది. ఆయన తలుపు కొట్టారు కూడా. అయినా మీరు లేవలేదు."

"నాది మొద్దు నిద్ర....అంతే కాకుండా రాత్రి ఎందుకో మరీ మొద్దునిద్ర పట్టింది. ఇంతకు ముందే మెలకువ వచ్చింది" అన్నాడు కంగారును అణుచుకుంటూ.

"అదేమిటండీ.... మొహమంతా అలా పీక్కుపోయినట్టు అయిందేమిటి?" అన్నదామె మళ్ళీ.

"బాగా నిద్రపోయాను కదా" అంటూ నవ్వాడు.

"సుమిత్రగారు ఇవాళ వస్తుందన్నారు కదూ?"

"అవును....ఎందువల్లనో రాలేదు. తెల్లవారుజామునకే రావలసింది. మరి ఎందువల్ల రాలేదో!" అని తాళంచెవి ఆమెకు యిచ్చి "సుమిత్ర వస్తే ఇవ్వండి" అని రోడ్డు మీదకు వచ్చాడు.

గట్టిగా గాలి పీల్చుకున్నాడు.

హోటల్లో భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

సాయంత్రం వరకూ ఆఫీసులో వున్నాడు. ఆఫీసునించి బయటకు రాగానే టెలిగ్రాఫ్ ఆఫీసుకు వెళ్ళాడు.

సుమిత్రను వెంటనే బయల్దేరి రమ్మని అత్తగారింటికి టెలిగ్రాం ఇచ్చాడు.

టెలిగ్రాఫ్ ఆఫీసులోంచి బయటకు వచ్చేసరికి అరున్నర అయింది. వాచీ చూసుకుని అదే రోడ్‌లో వున్న ఓ

థియేటర్ కు నడిచాడు.

అయిదు నిముషాల్లో సూర్యారావు సినిమా చూడటంలో లీనమయిపోయాడు.

# 6

ఉదయం తొమ్మిది గంటలు దాటింది. స్నానం చేసి తల దువ్వుకుంటున్నాడు సూర్యారావు.

ఇంటి ముందు రిక్షా ఆగింది. ఆగిన రిక్షాలోంచి సూర్యారావు అత్తగారు శారదాంబ దిగింది.

"రండి....సుమిత్ర యేదీ?" అన్నాడతను.

"సుమిత్ర మొన్న రాత్రే యిక్కడకు వచ్చింది" అన్నదామె.

"మొన్న రాత్రా? మొన్న రాత్రి బయల్దేరి వస్తున్నట్టు వుత్తరం రాసింది. కాని రాలేదు."

"ఏమయిపోయిందో అల్లుడూ....నీకు వుత్తరం రాసినట్టుగానే అది రాత్రి రైలుకి బయల్దేరింది. ఎందువల్ల యిక్కడకు రాలేదో? ఏమయ్యిందో భయంగా వుంది" అన్నదామె కంగారుగా.

"కంగారు పడకండి. ఇంకెక్కడికయినా వెళ్ళిందేమో విచారిద్దాం" అన్నాడు సూర్యారావు మామూలుగా.

"ఇంకెక్కడికి వెళుతుంది?" అన్నదామె.

"ఏమో....ఎవరయినా స్నేహితుల యింటికో, మీ బంధువుల యింటికో వెళ్ళి వుండవచ్చు."

"చెప్పకుండా రైల్లో ఎక్కిన మనిషి యింకొకరి ఇళ్ళకు ఎలా వెళుతుంది?"

"ఎందుకు వెళ్ళకూడదు? స్టేషన్లో ఎవరయినా స్నేహితురాలు కలిసి తమ వూరు రమ్మని పిలిచి వుండవచ్చు. అలా ఎవరితోనయినా కలిసి వెళ్ళిందేమో!"

"ఏమో.... నాకలా అనిపించటం లేదు అల్లుడూ! నాకేదో భయంగా వుంది. అమ్మాయి సంగతి నాకు బాగా తెలుసు. ఒకవేళ అది అలా ఎవరితోనయినా వెళ్ళినా మీకో, నాకో టెలిగ్రాం ఇస్తుంది కంగారుపడకుండా. ఇవ్వలేదంటే అది ఎవరింటికీ వెళ్ళలేదు. మధ్యలోనే మాయమయింది. అసలే రాత్రి ప్రయాణం....అందునా ఒంటరి ఆడది....ఏం జరిగి వుంటుందో.... నాకు భయంగా వుంది అల్లుడూ! ముందు పోలీసు రిపోర్టు ఇద్దాం" అన్నదామె భయంగా.

"పోలీసు రిపోర్టా?" కంగారు బయటకు కనిపించనీయకుండా అన్నాడు సూర్యారావు.

"అవును అల్లుడూ....పోలీసు రిపోర్టు యివ్వటమే మంచిది. ముందు ఇవ్వాలి. పోలీసులు కూడా ప్రయత్నం చేస్తేగానీ దాని విషయం తెలీదు."

"అలాగే ఇద్దాం. కాని ఇప్పుడే కాదు. ముందు మన ప్రయత్నాలు మనం చేద్దాం. ముందుగానే పోలీసు రిపోర్టు ఇస్తే ఈ విషయం నలుగురికీ తెలుస్తుంది. నా పరువు పోతుంది....ప్లీజ్, నన్ను అర్థం చేసుకోండి అత్తగారూ. ముందు మనం మనకు తెలిసిన వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి సుమిత్ర గురించి ఆరా తీద్దాము" అన్నాడు.

"ఏదో ఒకటి ముందు మనం బయల్దేరుదాం" అన్నదామె.

పక్క పోర్షన్‌లో వున్నామె-ఆమె అలా అంటూ వుండగానే "ఏమండోయ్ సూర్యారావుగారూ" అంటూ గబగబా ఇంట్లోకి వచ్చాడు. ఆమె చేతిలో తెలుగు దిన పత్రిక వుంది.

"ఏమిటి?" అన్నాడతను గబుక్కున.

"పేపర్లో ఈ ఫోటో చూడండి. సుమిత్రలా వుంది నాకు" అంటూ చూపించిందామె.

ఆత్రంగా పేపర్లోకి చూసింది శారదాంబ "సుమిత్రా" అంటూ.

క్షణం తర్వాత ఆమె ఘొల్లుమంది.

చాలా సేపటివరకూ సూర్యారావు ఆ ఫోటోని చూస్తూనే వుండిపోయాడు.

"ఎవరు సుమిత్రే కదూ" అన్నది పక్కపోర్షన్లో వున్నామె.

"అవును. అలాగే వుంది" అన్నాడతను.

పేపర్లో సుమిత్ర ఫోటో వెల్లకింతలా పడి వుంది. ఫోటో క్లియర్‌గా వుండటంవల్ల సులభంగానే గుర్తు పట్టటానికి వీలుగా వుంది.

"ఎంత పని చేశావే అమ్మాయ్" అని శోకాలు పెడుతోంది శారదాంబ.

ఫోటో కింద సుమిత్ర ఫోటోకి సంబంధించిన మేటర్ రాశారు—ఏదో కాలువలో దొరికిందనీ శవానికి సంబంధించినవాళ్ళు పోలీస్ స్టేషన్‌కి వెంటనే వచ్చి కలుసుకోవలసిందనీ రాసి వున్నది.

"సుమిత్ర ఎంత పని చేసింది?" అన్నది ప్రక్క పోర్షనామె.

"అమ్మాయ్ సుమిత్రా నాకేమిటే ఈ కడుపు కోత" అంటూ యేడుస్తోంది సుమిత్ర తల్లి.

సూర్యారావు ఏడుపు మొహం పెట్టుకుని అత్తగార్ని చూస్తున్నాడు.

చుట్టుపక్కల ఇళ్ళలో వాళ్ళు ఒక్కొక్కరే సూర్యారావు ఇంట్లోకి చేరుతున్నారు.

"నా పేరు రాఘవ" అన్నాడతను.

ఎర్రగా, పొడుగ్గా వున్నాడు. పైకి దువ్విన క్రాపు... చూడగానే తెలివిగల మనిషిలా అనిపించాడు.

"కూర్చోండి" అన్నాను.

నా ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు.

నేనో సిగరెట్ వెలిగించి అతనికి ఒకటి ఇవ్వబోయాను.

"నాకు అలవాటు లేదు సార్" అన్నాడు.

నవ్వాను. ఈ రోజుల్లో సిగరెట్ తాగని యువకులు వుండరు. చాలా తక్కువమందిలో యితనొకడు అనుకున్నాను.

"చెప్పండి....ఏం పనిమీద వచ్చారు?" అడిగాను పొగ బయటకు వదలి.

"నిన్నటి తెలుగు దినపత్రిక 'ప్రతిరోజు' చూశారా?" అడిగాడతను.

"చూశాను....ఎందుకు?"

"అందులో నీళ్ళల్లో పడి మరణించిన ఓ యువతి ఫోటో వేశారు. చూశారనుకుంటాను."

"అవును."

"ఆ యువతి మరణం గురించి మిమ్మల్ని దర్యాప్తు చెయ్యమని అడగటానికి వచ్చాను."

"ఆశ్చర్యంగా వుంది. ఆ యువతి ఎవరు? ఆమె మీకు ఏమవుతుంది?" అడిగాను.

"చెబుతాను....ఒక్క విషయం గుర్తుంచుకోండి జగదీష్‌గారూ! నేను చెప్పేది మీ దర్యాప్తుకు అవసరమయిన మేటర్. ఇంతవరకు ఎవ్వరికీ ఈ రహస్యం తెలి

యదు. మొదటిసారిగా మీకే చెబుతున్నాను. నేను చెబుతున్న ఈ విషయాన్ని మీరు రహస్యంగానే వుంచుతానని హామీ ఇవ్వండి" అన్నాడు రాఘవ.

"సారీ మిస్టర్. ఇటువంటి హామీలను నేను ఇవ్వలేను. అవసరమయితే మీరు చెప్పిన విషయాలను బయటపెట్టవలసి వుంటుంది. అవసరం లేకపోతే మాత్రం నేను ఆ రహస్యాలను బయటకు రానీయను."

"థాంక్స్.... ఈ రహస్యాలను బయటపెట్టవలసిన అవసరం రాదనే అనుకుంటాను. ఒకవేళ వచ్చినా బాగా ఆలోచించి బయట పెట్టండి. నేను నా గురించి భయపడటం లేదు. చనిపోయిన మనిషి మంచిది కాదని నలుగురికీ తెలియటం మంచిది కాదు."

"ఆల్ రైట్. ఇక మీరు చెప్పండి" అన్నాను సిగరెట్‌ను యాష్ట్రేలో కుక్కి—.

"పేపర్లో ఫోటో పడిన యువతి పేరు సుమిత్ర. నేను-సుమిత్ర డిగ్రీలో క్లాసు మేట్స్యం. ఇద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్నాం. కాని మా ఇద్దరి కులాలు ఒకటి అవకపోవటంవల్ల సుమిత్ర తల్లి గారు ఒప్పుకోలేదు.

సుమిత్రకు తండ్రి లేడు. ముగ్గురు చెల్లెళ్ళున్నారు. తండ్రి సంపాదించిన ఆస్తి కొంత వుంది. తల్లి మనసును బాధ పెట్టటం ఇష్టంలేక సుమిత్ర—సూర్యారావును పెళ్ళి చేసుకుంది.

కాని మా యిద్దరి మధ్య వున్న సంబంధం సుమిత్ర పెళ్ళితో ఆగిపోలేదు. పెళ్ళికి పూర్వమే మా యిద్దరికీ శారీరక సంబంధం కూడా వుంది. పెళ్ళయినా అది అలా కొనసాగుతూనే వుంది. రెండు నెలలకీ మూడు నెలలకీ

ఏదో వంకతో సుమిత్ర ఈ వూరు వచ్చేది. ఓ వారం రోజులు వుండేది. ఇద్దరం కలుసుకుంటూ వుండేవాళ్ళం.

అయితే ఈ విషయం ఎవ్వరికీ తెలీదు. సుమిత్ర కూడా చాలా జాగ్రత్తగా వున్నది.

పదిహేను రోజుల క్రితం తల్లినీ, చెల్లెళ్ళనీ చూడాలని వున్నదని చెప్పి సుమిత్ర ఈ వూరు వచ్చింది. వారం రోజుల్లోనే తిరిగి వస్తానని భర్తతో చెప్పిందిట. చెప్పినట్టుగా వారం రోజులకు వెళ్ళలేదు. పది రోజులు ఇక్కడే వుంది.

ఐదు రోజుల క్రితం తన వూరికి రాత్రి ఎక్స్‌ప్రెస్‌లో సుమిత్ర బయల్దేరింది. ఆ రోజు రాత్రి తను బయల్దేరి వస్తున్నట్టు భర్తకు వుత్తరం రాసిందిట. ఉత్తరం రాసినట్టుగానే నేను ఇంకో నాలుగు రోజులు వుండమని కోరినా వీల్లేదంటూ ఆ రాత్రికే ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది.

"ఎన్నో తారీకునో చెప్పండి కరెక్టుగా" అడిగాను.

"పన్నెండో తారీకు రాత్రి తొమ్మిది గంటల తర్వాత బయల్దేరే ఎక్స్‌ప్రెస్‌లో."

"పన్నెండు రాత్రి ఎక్స్‌ప్రెస్‌లోనా? అయితే అదే ఎక్స్‌ప్రెస్‌లో ఆ రాత్రి నేను కూడా ప్రయాణం చేశాను" అన్నాను మరో సిగరెట్ వెలిగిస్తూ.

"మీరు కూడా ప్రయాణం చేశారా?" అడిగాడు రాఘవ.

"అవును.... చెప్పండి" అన్నాను.

"ఏముంది? ఆ రైల్లో బయలుదేరిన సుమిత్ర, భర్త ఇంటికి చేరలేదు. మధ్యలోనే ఓ కాలువలో పడి చచ్చిపోయింది. ఆ ఫోటోనే నిన్నటి పేపర్లో వేశారు" అన్నా

డితను బాధగా.

నేను మాట్లాడలేదు....ఆలోచనలో పడిపోయాను.

"అవును. ఆమె నీళ్ళలో పడిపోతూ పెద్ద ఆర్తనాదం కూడా చేసిందట" అన్నాను.

"ఆర్తనాదమా?!...." ఆశ్చర్యంగా అడిగాడు రాఘవ.

"అవును. ఆ ట్రెయిన్‌లో ఎక్కిన ఇరవై నిముషాలకు నేను నిద్రపోయాను. తర్వాత యెప్పుడో మెలుకువ వచ్చింది. లేచేసరికి నా కంపార్టుమెంటులో కూర్చున్న మనుషులు యేదో విషయం గురించి మాట్లాడుకుంటు న్నారు. ఏమిటని అడిగితే ఐదునిముషాల క్రితం యెవరిదో స్త్రీ ఆర్తనాదం వినిపించిందని చెప్పారు.

"అయితే తప్పకుండా ఆ ఆర్తనాదం సుమిత్రదే అయి వుంటుంది. సుమిత్ర నీళ్ళలో పడిపోతూ ఆ ఆర్తనాదం చేసి వుండాలి" అన్నాడు రాఘవ.

"అవును....ఇంతకీ సుమిత్ర రైల్లోనించి అంత చీకట్లో నీళ్ళల్లోకి ఎందుకు పడిపోయి వుంటుంది? ప్రమాదవశాత్తు అయి వుంటుందా? లేకపోతే ఆత్మహత్య చేసుకుని వుంటుందా?"

"ఆత్మహత్య చేసుకుని వుండదు. ఎవరో సుమిత్రను రైల్లోనించి నీళ్ళలోకి నెట్టి హత్య చేశారు" అన్నాడతను గట్టిగా.

"ఇది హత్య అని మీరు గట్టిగా ఎలా చెప్పగలరు?" అడిగాను అతని కళ్ళలోకి చూస్తూ.

"అంతే కాదు. హంతకుడు యెవరో కూడా చెప్ప గలను" అన్నాడతను.

"ఎవరు?" ముందుకు వొంగుతూ అడిగాను.

"ఎవరోకాదు, సుమిత్ర భర్త సూర్యారావు."

"ఆమె భర్తా! ఎలా చెప్పగలరు? అతనెలా హత్య చేస్తాడు? అతను యెక్కడో తన వూళ్ళోనే వున్నాడు కదా?"

"లేదు. ఆ రోజు రాత్రి సుమిత్రను హత్య చెయ్యటానికి ముందుగానే బయల్దేరి వచ్చి వరంగల్లు స్టేషన్‌లో సుమిత్ర ఎక్కవచ్చే ఎక్స్‌ప్రెస్‌కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు."

"ఇదంతా మీకెలా తెలుసు? సూర్యారావు ముందుగానే వచ్చి వరంగల్లు స్టేషన్‌లో ఆమె ఎక్కవచ్చే ఎక్స్‌ప్రెస్‌కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడని?"

"ఇటునించి బయల్దేరే ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా అటువైపునించి కూడా ఓ ఎక్స్‌ప్రెస్ వస్తుంది. అందులో నా స్నేహితుడొకడు విజయవాడనించి వస్తున్నాడు. అతను కూడా మా క్లాసుమేటే. అతనికి సూర్యారావు తెలుసు. అతనికి సుమిత్ర యిక్కడినించి బయల్దేరిన రోజు రాత్రి సూర్యారావు వరంగల్ స్టేషన్‌లో ప్లాట్‌ఫారంమీద కనిపించాడుట సిగరెట్టు కాలుస్తూ."

"అతన్ని మీ స్నేహితుడు సరిగ్గా గుర్తుపట్టాడో లేదో?" అన్నాను.

"అటువంటి సందేహం అవసరం లేదు. ఇప్పుడయినా అతను సూర్యారావును గుర్తుపట్టగలడు. అతనే నాతో ఈ విషయం ఆ మరురోజునే చెప్పాడు."

వెంటనే మాట్లాడలేదు నేను. నా మెదడులో ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి. రాఘవ చెబుతున్నదంతా రీజనబుల్‌గా వున్నట్లనిపిస్తోంది.

సుమిత్ర ఆత్మహత్య చేసుకోలేదు. ప్రమాదవశాత్తూ పడిపోలేదు. ఆత్మహత్య చేసుకుంటే అలా ఆర్తనాదం చెయ్యదు. ఎవరో ఆమెను బయటకు నెట్టివుండాలి. ఆ యెవరో సుమిత్ర భర్త సూర్యారావే అయివుండొచ్చు. ఏమయినా దర్యాప్తు మొదలుపెడితేగానీ అసలు విషయం బయటకు రాదు.

"ఇంకో విషయం జగదీష్‌గారూ.... సుమిత్ర ఆ రైలుకు బయల్దేరి వస్తున్నట్టు ఆమె భర్తకు ముందుగా తెలుసు" అన్నాడు రాఘవ.

"ఒక్క విషయం చెప్పండి. సూర్యారావు—సుమిత్రను హత్య చెయ్యటానికి కారణం యేమిటి? మీ ఇద్దరికీ యిటువంటి సంబంధం వున్నట్టు అతనికి తెలుసా?" అడిగాను.

"తెలీదు. కాని తెలుసునని నా అనుమానం. ఎందుకంటే క్రితంసారి సుమిత్ర యిక్కడకు వచ్చి వెళ్ళిన తర్వాత ఆమెకు ఓ ఉత్తరం రాశాను. ఆ ఉత్తరాన్ని సూర్యారావు తీసుకున్నాడట. అప్పుడు సుమిత్ర ఇంట్లో లేదుట. ఆమె రాగానే ఆ ఉత్తరాన్ని చదవకుండానే ఆమెకు యిచ్చేశాడుట. సుమిత్రే ఈ విషయాన్ని మొన్న వచ్చినప్పుడు చెప్పింది. కాని నాకు నమ్మకం లేదు అతను ఆ ఉత్తరాన్ని చదవలేదంటే.... చదివిన తర్వాతనే దాన్ని మళ్ళీ అంటించి సుమిత్రకు యిచ్చి వుంటాడు. అప్పుడే సుమిత్రను హత్య చెయ్యాలని ప్లాను వేసుకుని వుంటాడు. అందుకే సుమిత్రను ఆ ఉత్తరం గురించి అడిగి వుండడు. ఇది ప్లాను ప్రకారం జరిగిన హత్య...." అన్నాడు రాఘవ.

"అవును" అన్నాను తల వూపుతూ.

"జగదీష్‌గారూ....తప్పకుండా అతనే హంతకుడు ఐవుండాలి. అతన్ని పట్టుకోండి. అతనికి శిక్ష పడేలా చెయ్యండి. నేను ఫీజు యెక్కువగా యివ్వలేను. ఐనా నా శక్తికొద్దీ యిచ్చుకుంటాను. సుమిత్రను నేను పెళ్ళి చేసుకోక పోవచ్చును. కాని మా యిద్దరికీ యెప్పుడో పెళ్ళయిపోయినట్టు లెక్క....ఆమెను చంపిన ఆ దుర్మార్గుడికి కఠినమైన శిక్ష పడాలి...." అన్నాడు ఆవేశంగా రాఘవ.

"తప్పకుండా. మీరు మీ ఎడ్రస్, సుమిత్ర తల్లి వుండే యింటి ఎడ్రసూ యిచ్చి వెళ్ళండి. నేను దర్యాప్తు చేసి హంతకుడ్ని పట్టుకుంటాను" అన్నాను.

"థాంక్స్ సార్....ఇవిగో వెయ్యి రూపాయలు. ఖర్చులకు వుంచండి" అంటూ అతను పర్సులోంచి నోట్లు తీసి బల్లమీద వుంచాడు.

వాటిని తీసి జేబులో పెట్టుకున్నాను. తర్వాత అతను నే నడిగిన యెడ్రసులు యిచ్చి నమస్కారం చేసి వెళ్ళి వెళ్ళిపోయాడు.

నేను ఆలోచనలో పడిపోయాను.

## 8

రాత్రి పదిగంటలయింది. సూర్యారావు కుర్చీలో వెనక్కువాలి పడుకుని సిగరెట్టు కాలుస్తున్నాడు. అతని గడ్డం పెరిగిపోయి వుంది. రోజూ షేవింగ్ చేసుకుందామని అనుకుంటూనే చేసుకోకుండా బలవంతాన ఆ కోరికను ఆపుకుంటున్నాడు అతను.

భార్య పోయి యింకా పదిరోజులు అవకముందే తను నీట్‌గా తయారయి ఇదివరకటిలా తిరుగుతుంటే లోకం తనని అనుమానిస్తుంది.

సుమిత్ర ఆత్మహత్య చేసుకుందని పోలీసులను ఎట్లాగో నమ్మించి వాళ్ళకు కొంతడబ్బు ముట్టచెప్పి కేసు లేకుండా చేసుకున్నాడు. అందుకే సంతోషంగా వున్నా లోకం కోసం భార్య పోయినందుకు విచారం నటిస్తున్నాడు.

అతని ముందు టీపాయ్ వుంది. దానిమీద హేవార్డ్స్ విస్కీ బాటిలు వుంది. అతను నెమ్మదిగా ఒక్కడే ఇంట్లో కూర్చుని తాగుతున్నాడు.

బాటిల్లో వున్న విస్కీని గ్లాసులోకి వంచుతుండగా ఎవరో తలుపు తట్టారు.

అతను వెంటనే మాట్లాడలేదు. నిముషంసేపు మవునంగా వుండిపోయాడు.

బయట ఎవరో ఇంకా తలుపులమీద గట్టిగా కొడుతూనే వున్నారు.

పక్క పోర్షన్‌లో వుంటున్నవాళ్ళు యెవరయినా అయివుంటారనుకున్నాడు. కాని వాళ్ళు ఆ రోజు ఉదయమే యేదో వూరు అందరూ వెళ్ళిన విషయం గుర్తొచ్చింది.

"ఎవరు?" అన్నాడు సూర్యారావు.

"నేనే తలుపు తియ్యి...." అన్నాడు బయట మనిషి.

లేచివెళ్ళి తలుపు తెరిచాడు అతను.

లోపలకు వచ్చాడతను సూర్యారావును నెట్టుకుంటూ.

అతన్ని చూడగానే షాక్ కొట్టినవాడిలా అయిపోయాడు సూర్యారావు.

అతను యెవరో కాదు. ఏ మనిషి నయితే అతను మరచిపోవాలని అనుకుంటున్నాడో అతనే ఆ మనిషి.... తను తన భార్య హత్య విషయంలో యిరుక్కోకుండా

వుండటానికి సృష్టించుకున్న ఎలిబీని బద్దలు కొట్టగల మనిషి.

"తలుపులు మూసేయ్...." అన్నాడు అతను నవ్వుతూ.

"ఎందుకొచ్చావ్ నిరంజనం?" అన్నాడు సూర్యారావు తలుపులు మూసి వెనక్కి తిరిగి.

"అదేం మాటోయ్ ఫ్రెండ్....చక్కగా యింట్లో ఒక్కడివే కూర్చుని మందు కొడుతున్నావా? తప్పకదూ మరో మనిషి తోడు లేకుండా మందు కొట్టకూడదని ఆ మాత్రం తెలీదూ నీకు?" అని ఓ కుర్చీని టీపాయ్ యెదురుగా లాక్కొని కూర్చున్నాడు.

"చెప్పు....ఇక్కడికెందు కొచ్చావ్?" కటువుగా అడిగాడు సూర్యారావు. అతనికి మనసులో భయంగా వుంది. అయినా తన భయాన్ని దాచుకుని లేని ధైర్యాన్ని తెచ్చుకుని అడిగాడు అతను.

"నీ భార్య ఆత్మహత్య చేసుకుందని విని నా సానుభూతి నీకు స్వయంగా తెలియబరుచుకుందామని వచ్చాను. ఈ గ్లాసులో కూడా దాన్ని కొంచెం వొంచు"అన్నాడు నవ్వుతూ.

"పిచ్చిగా వాగకు నిరంజనం....చెప్పు....యింత రాత్రివేళ నువ్వు యెందుకు వచ్చావ్ నా యింటికి?"

"నన్నింతగా నొక్కి నొక్కి అడుగుతున్నావంటే నా గురించి నువ్వు భయపడుతున్నావన్న మాట....అయితే నేను వూహించినది నిజమే."

"ఏమిటా నిజం?" ఖంగారుగా అడిగాడు సూర్యారావు.

"బలే తెలివిగా హత్య చేశావ్ గురూ—నీ

భార్యను...."

అంతే....సూర్యారావు ఈడ్చి నిరంజనం చెంపమీద కొట్టాడు.

నిరంజనానికి కళ్ళు తిరిగాయి.

"ఏమిటి నువ్వు వాగుతున్నది ఇడియట్.... నేను నా భార్యను హత్య చేశానా?" కోపంగా అన్నాడు సూర్యారావు.

"సూర్యారావ్....నువ్వు నన్ను కొట్టి బెదిరించి నా నోరు మూయలేవు. నువ్వు నీ భార్య పుట్టింటినించి బయల్దేరిన రోజు రాత్రి యింట్లోనే వున్నట్టు ఎలిబీ సృష్టించుకున్నట్టున్నావ్ ...అందుకే నిన్ను పోలీసులు వదిలారు. నీ భార్య ఆత్మహత్య చేసుకుందని నమ్మారు.

కాని ఆ రోజు అర్ధరాత్రి నువ్వు వరంగల్ స్టేషన్‌లో నాకు కనిపించావని నేను పోలీసులకు చెప్పానంటే నీ బతుకు ఏమవుతుందో ఆలోచించుకో...." అన్నాడు నిరంజనం.

ఆ మాటతో సూర్యారావు తెచ్చిపెట్టుకున్న ధైర్యం సడలిపోయింది. నిరంజనాన్ని బెదిరించటం ప్రమాదమనిపించింది. అతన్ని మంచిగా మాటలతో లొంగదీసుకోవాలనుకున్నాడు.

నిరంజనం అసలే క్రాక్....అతనికి యెవ్వరూ లేరు. ఏదో ఒక పని చేసి డబ్బు సంపాదించి బార్‌లో కూర్చుని తాగుతూ వుంటాడు. బార్‌లోనే సూర్యారావుకీ అతనికీ పరిచయమయింది.

"సారీ నిరంజనం....ఏదో కోపంలో వుండి నిన్ను కొట్టాను. ఏమనుకోకు. ఇంతకీ నువ్వనేదేమిటి?" అన్నాడు సూర్యారావు.

నిరంజనం మొహం వికసించింది సూర్యారావు అలా అనగానే.

"నువ్వు ఆ రాత్రి రైల్లోనించి నీ భార్యను నీళ్ళలోకి నెట్టి హత్య చేశావ్ కదూ?" అన్నాడు వెంటనే.

"అసలు విషయం నీకు తెలీదు నిరంజనం.... నేను నా భార్యను హత్య చెయ్యలేదు. ఇద్దరం డోర్ దగ్గర నిలబడి బయటి పరిసరాలను చూస్తూ మాట్లాడుకుంటున్నాం.... చీకటిగా వుండటంవల్ల నా భార్య కొంచెం ముందుకు జరిగింది. అంతే. కింద పడిపోయింది.

తర్వాత నాకు భయమేసింది. ప్రమాదవశాత్తూ పడి పోయినా నేనే ఆమెను నెట్టి హత్య చేశానని అంటారు. అందుకని నేను తర్వాత స్టేషన్లో దిగి తెల్లవారకముందే యింటికి వచ్చాను. నేను ఆ రాత్రి యిల్లు కదల్లేదని చెప్పాను. ఇదీ అసలు జరిగింది. అంతేగానీ నేను నా భార్యను హత్య చెయ్యలేదు...." అన్నాడు.

నవ్వాడు నిరంజనజం అతను చెప్పింది విని.

"బలే గొప్ప కథ చెప్పావ్ గురూ.... నువ్వు డిటెక్టివ్ కథలు రాయి. పెకొస్తావ్.... అసలు నువ్వు వరంగల్లు స్టేషన్కు యెందుకు వెళ్ళాల్సి వచ్చింది? పోలీసులు ముందు నిన్ను యిదే ప్రశ్న అడుగుతారు.... దీనికి నువ్వు జవాబు చెప్పలేవు.

దర్యాప్తు జరుగుతుంది! అసలు విషయం ఏది వుంటే అది బయటకు వస్తుంది. అప్పుడు నువ్వు ఏ జైలు కావా లనుకుంటే ఆ జైల్లో వుంటావ్.... సరేనా.... ఇదంతా యెందుకొచ్చిన గొడవ.... నేను చెప్పినట్టు చెయ్యి.... ఏ గొడవా వుండదు" అన్నాడు నిరంజనం గ్లాసులో వంచు కున్న విస్కీని తాగిన తర్వాత.

"ఏం చెయ్యమంటావ్?" గబుక్కున అడిగాడు సూర్యారావు.

"ఓ పదివేలు ఇలా పారెయ్....నా నోరు మూసుకుంటాను....నేను చూసిన దాన్ని మరచిపోతాను."

"పదివే లివ్వాలా? నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నావా?"

"నువ్వు యేదనుకుంటే అది. కాని నేను మాత్రం అలా అనుకోను....కొంతమంది సాక్ష్యం చెప్పటానికి డబ్బు లిస్తారు. కొంతమంది సాక్ష్యం చెప్పకుండా వుండటానికి డబ్బు తీసుకుంటారు. అంతే...."

"పదివేలు నేను ఇవ్వను....నా దగ్గర అంత డబ్బు లేదు" అన్నాడు సూర్యారావు మొండిగా.

"మరి ఎంత ఇవ్వగలవు?"

"రెండువేలు ఇస్తాను."

"రేపు పొద్దున ఎవడయినా అడుక్కునేవా డొస్తాడు. వాడి కివ్వు ఆ రెండువేలు."

"మరి ఎంతివ్వమంటావ్?"

"ఎనిమిదివేలకు తక్కువ తీసుకోను....యిది యింకేదో కేసు కాదు. హత్య కేసు....అందుకే ఎనిమిదివేలు...."

"సరే ఒప్పుకుంటున్నాను. కాని డబ్బు యిప్పుడు నా దగ్గరలేదు. రేపు సాయంత్రానికి ఎక్కడయినా సాధిస్తాను. నువ్వు ఇక్కడకు రావొద్దు. నేనే నీ గదికి తీసుకొస్తాను" అన్నాడు సూర్యారావు.

"వద్దు....నువ్వు నా గదికి రావొద్దు. రాత్రి తొమ్మిది గంటలకు నేనే యిక్కడకు వస్తాను. డబ్బు సిద్ధం చేసి వుంచు" అన్నాడు నిరంజనం.

"నీ యిష్టం....అలాగే" అన్నాడు సూర్యారావు.

“థాంక్ యూ బ్రదర్. నువ్వు జైలుకు వెళ్ళటం నాకు ఇష్టం లేదు. అందుకే నీతో ఈ బేరం కుదుర్చుకున్నాను. ఇదే ఇంకెవరయినా అయినట్లయితే నేరుగా వెళ్ళి పోలీసులకు చెప్పేవాడిని” అన్నాడు నిరంజనం విస్కీని గ్లాసులోకి వంచుతూ.

సూర్యారావు మాట్లాడలేదు. ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ వుండిపోయాడు.

## 9

వరంగల్ స్టేషన్‌లోకి అడుగుపెట్టాను. ఏదో ట్రెయిన్ రాబోతున్నదనుకుంటాను. స్టేషను నిండుగా జనం వున్నారు.

సాయంత్రం ఆరు గంటలు దాటుతోంది. బుకింగ్ కౌంటర్ దగ్గరకు వెళ్ళేను. నలుగురు మనుష్యులు లైన్‌లో నిలబడి టిక్కెట్లు తీసుకుంటున్నారు.

వాళ్ళు టిక్కెట్లు తీసుకుని అక్కడినించి వెళ్ళిపోయే వరకూ ఆగాను. వాళ్ళు వెళ్ళిపోగానే “క్షమించాలి” అంటూ నన్ను నేను పరిచయం చేసుకున్నాను బుకింగ్ క్లర్కుకు.

ఆయన మొహం వెడల్పయింది. సంతోషంతో “లోపలకు రండి” అన్నాడు.

లోపలకు వెళ్ళాను. ఆయన చూపించిన కుర్చీలో కూర్చున్నాను.

“చెప్పండి....ఏం పనిమీద వచ్చారు?” అడిగాడాయన నవ్వుతూ.

“ఓ హత్యకేసు దర్యాప్తు చేస్తున్నాను. మీరు నాకో ఇన్‌ఫర్మేషన్ ఇవ్వాలి.”

“ఏమిటి?”

“ఈ నెల పన్నెండో తారీకు రాత్రి ఈ బుకింగ్‌లో

మీ కే వున్నారా? ఇంకెవరయినా వున్నారా?"

ఆయన ఒక్క నిమిషం ఆలోచించి "నేనే వున్నాను" అన్నాడు.

"అయితే ఈ ఫోటో చూడండి. ఈ మనిషి పన్నెండో తారీకు రాత్రి హైద్రాబాద్ నించి వచ్చే ఎక్స్ప్రెస్‌కు టిక్కెట్టు తీసుకున్నాడు" అంటూ పర్సు జేబులోనించి సూర్యారావు ఫోటోను ఆయనకు చూపించాను.

ఆయన ఫోటోను చూడటంతోనే "అవును ఇతను ఆ రాత్రి ఇక్కడే ఖమ్మానికి టిక్కెట్టు తీసుకున్నాడు" అన్నాడు.

"బాగా చూడండి.... ఇది హత్యకేసు.... మీరు చెప్పే ఈ విషయం మీద నా దర్యాప్తు ముందుకు సాగుతుంది" అన్నాను.

"అనుమానం లేదు. ఇతను నాకు ఇంతగా గుర్తుండ టానికి కారణాలు రెండు: ఒకటి—ప్రస్తుతం ఒరిస్సాలో వుంటున్న నా బావమరిది కూడా ఇలాగే వుంటాడు. ఇతన్ని ఆ రాత్రి గబుక్కున చూడగానే అతనే అని అను కున్నాను.... కాని కాదు. ఇంకోటి—అతను నాకు వంద రూపాయల నోటు యిచ్చాడు. చిల్లర లేదని అన్నాను. తర్వాత ఇరవై రూపాయల నోటు యిచ్చాడు. అంతే కాకుండా ఆ ట్రెయిన్‌కు చివరగా టిక్కెట్టు తీసుకొన్న మనిషి యితనే...." అన్నాడు బుక్కింగుక్లర్కు....

"థాంక్స్ సార్...." అని "ఇప్పుడు ఖమ్మం వెళ్ళే ట్రెయిను యేదయినా వుందా?" అని అడిగాను.

"మద్రాస్ ఎక్స్ప్రెస్ వుంది" అన్నాడాయన.

"అయితే ఓ టిక్కెట్టు యివ్వండి" అన్నాను. పర్సు లోంచి డబ్బులు తీసి ఇచ్చాను.

టిక్కెట్టు తీసుకుని ఆయనకు మరోసారి థాంక్స్ చెప్పి ప్లాట్ ఫారం మీదకు వచ్చాను.

ఏడుగంటలు దాటుతుండగా వచ్చింది ఎక్స్‌ప్రెస్....

ఎక్కాను.

వెంటనే బయల్దేరింది రైలు.

రైలుతోపాటు నా ఆలోచనలు మొదలయినాయి.

రాఘవ ఈ కేసును దర్యాప్తు చెయ్యమని చెప్పి వెళ్ళిన తర్వాత సుమిత్ర తల్లిగారింటికి వెళ్ళాను. పాపం. ఆమె తన కూతురు ఎందుకు ఆత్మహత్య చేసుకుందో అర్థం కాక ఏడుస్తోంది.

ఇది నాకు ఆత్మహత్యలా అనిపించటం లేదనీ, హత్య అయివుండవచ్చుననీ చెప్పి ఆమెదగ్గర సుమిత్ర, సూర్యా రావుల ఫోటోలు తీసుకున్నాను.

వరంగల్లు స్టేషన్ బుక్కింగ్ క్లర్కు సూర్యారావు ఫోటోను గుర్తుపట్టగానే తప్పకుండా హంతకుడు అతనే అని నిర్ణయానికొచ్చాను. లేకపోతే అతను ట్రెయిన్‌లో తన దగ్గరకు వస్తున్న భార్యను ముందుగానే వచ్చి కలుసుకోవలసిన అవసరం యేమున్నది?

రాఘవ స్నేహితుడు ఆ రాత్రి చూసింది సూర్యా రావునే. అతను పొరపాటు పడలేదు.

తొమ్మిది గంటలు కావస్తూండగా ఎక్స్‌ప్రెస్ ఖమ్మం స్టేషన్‌లో ఆగింది.

గబగబా స్టేషన్ బయటకు వచ్చాను.

ఓ రిక్షా ఎక్కి పోలీస్ స్టేషన్‌కు పోనివ్వమన్నాను.

రిక్షావాడు నా వైపు ఆశ్చర్యంగా చూసి రిక్షా తొక్కటం మొదలుపెట్టాడు.

అతను హంతకుడు అనటానికి కావలసిన ఓ ఆధారం

దొరికింది. ఇక మిగిలిన కొన్ని పద్ధతుల ద్వారా అతని చేత నిజాన్ని ఒప్పించాలి. అందుకు పోలీసుల సహాయం ఎంతయినా అవసరం.

ఖమ్మం ఇన్‌స్పెక్టర్ నాకు బాగానే స్నేహితుడు. అతన్ని, పోలీస్‌లను వెంటపెట్టుకుని వెళితే మరింత సులభంగా అవుతుంది.

రిక్షా పోలీస్ స్టేషన్ ముందు ఆగింది.

దిగి అతనికి డబ్బులిచ్చి లోపలకు నడిచాను.

లోపల వున్నాడు ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్....

నన్ను చూడగానే "హల్లో ఫ్రెండ్....ఏమిటీ రావటం....ఇప్పటికి గుర్తుకొచ్చానా" అన్నాడు లేచి నిలబడి ఆప్యాయంగా నా చేయి నొక్కి....

"ఇప్పుడయినా నిన్ను చూడటానికి రాలేదు బ్రదర్! ఈ వూళ్ళో వున్న ఓ హంతకుడిని నీకు పట్టివ్వటానికి వచ్చాను" అన్నాను నవ్వుతూ.

"హంతకుడా? ఎవరు?" అడిగాడు అతను.

చెప్పాను.

"అలాగా" అని అప్పటికప్పుడే ఇద్దరు కానిస్టేబుల్స్‌ను తీసుకుని జీపులో బయల్దేరాడు.

ఐదు నిముషాల్లో జీపు సూర్యారావు యింటి ముందు ఆగింది. సుమిత్ర తల్లి అల్లుడి ఇంటి గుర్తులను బాగానే చెప్పింది.

ఆ ఇంటికి చుట్టూ గోడలు లేవు.

వాచీ చూసుకున్నాను జీపు దిగగానే. తొమ్మిదిన్నర కావస్తోంది.

"ఇదే ఇల్లు" అన్నాడు విశ్వనాథ్ తలుపుల ముందుకు వెళ్ళి నిలబడి,

పక్క పోర్షన్‌ని చూశాను. తాళం వేసి వుంది.

సూర్యారావు యింటి తలుపులు మూసి లోపల గడియ పెట్టబడి వున్నాయి.

హేండ్‌స్టిక్‌తో తలుపుమీద చప్పుడు చేశాడు ఇన్‌స్పెక్టర్.

లోపల యెటువంటి అలికిడీ వినిపించలేదు. ఎవ్వరూ తలుపులను తెరవలేదు.

ఓ కానిస్టేబుల్ వెనకవైపు గోడ యెక్కి చూసి వచ్చాడు. వెనుక తలుపులు కూడా లోపల గడియపెట్టబడి వున్నాయిట.

అంటే సూర్యారావు ఇంట్లోనే వున్నాడు.

ఇంట్లో వుండి తలుపులను బాదుతున్నా తెరవకుండా యెందుకు వుంటాడు?

కిటికీ తలుపులు కూడా మూసి వున్నాయి. కాని కిటికీ సందుల్లోనించి లోపల వెలుగుతున్న దీపం కాంతి బయటకు వస్తోంది.

తలుపులను విరగొట్టమన్నాడు విశ్వనాథ్ కానిస్టేబుళ్ళను.

క్షణాలమీద తలుపులు విరిగాయి.

లోపలకు వెళ్ళి ముందుగదిలో దృశ్యం చూసి స్థంభించి పోయాము.

నిరంజనం శవం వెల్లికింతలా పడి వున్నది. దాని ప్రక్కనే చేతిలో కత్తితో పిచ్చివాడిగా నిలుచున్నాడు సూర్యారావు.

"మైగాడ్" అన్నాను అప్రయత్నంగానే.

—: ఐపోయింది :—